

# లైఫ్

## (LiFE)

## పర్యావరణ రక్షణకై జీవన విధానం

## (Lifestyle for Environment)

పర్యావరణంపై మానవుల ప్రభావం తగ్గించడానికై అంతర్జాతీయంగా వివిధ స్థాయిలలో అనేక సంస్థలు, కూటములు పని చేస్తున్నాయి. తమతమ పరిధులలో పని చేసే ఈ వ్యవస్థలు వాతావరణ పాలనకి శాస్త్రీయ, ఆర్థిక, రాజకీయ రూపాలలో సహాయం అందిస్తాయి. ఈ నియంత్రణ వ్యవస్థల ఏర్పాటుకి, ఖర్చు చేసిన వనరులకి, శ్రమకి తగ్గ ఫలితాలు అందటం లేదు. కారణం తీసుకున్న నిర్ణయాలు, కల్పించుకున్న ఒప్పందాలు సరియైన పద్ధతిలో అమలు కావటం లేదు.

పెరుగుతున్న హరిత గృహ వాయువులు, హెచ్చు అవుతున్న భూగోళ ఉష్ణోగ్రత మరియు సముద్ర మట్టాలు, నియంత్రణ లేకుండా పోతున్న గాలి, నీరు, భూకాలుష్యం, మునుపెన్నడూ లేని విధంగా మారిపోతున్న జీవ వైవిధ్యం, చెట్లు కనుమరుగై అనేక ప్రాంతాలు ఎడారులుగా మారటం లాంటివి అన్నీ కూడా భూగోళ పర్యావరణ సమస్యలకి లక్షణాలుగా మారుతున్నాయి. ప్రపంచ స్థాయిలో పనిచేసే అనేక సంస్థలు, నిర్వహించే సమావేశాలు ఈ లక్షణాలను తగ్గించడానికే ఉద్దేశించ బడినవి. ప్రపంచ వ్యాప్తంగా నిర్ణీత, ఖచ్చితమైన చర్యలు తీసుకోకపోతే ఈ లక్షణాలను నియంత్రించటం కష్టతరం అవుతుంది. ప్రజలు వ్యక్తిగతంగా, స్వచ్ఛందంగా మరియు సమూహాలుగా వారి జీవన విధానాలలో మార్పులు తీసుకు రాగలిగినప్పుడే ఈ పర్యావరణ సమస్యలు పరిష్కారం అవుతాయి.

# పర్యావరణానికై జీవన విధానం (లైఫ్)

పర్యావరణానికై జీవన విధానం (లైఫ్) అన్నది సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు అన్నిటిలో పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకొని చేసే సమకాలీన చర్యలతో ముడిపడి ఉంది.

భారత దేశం అనాదిగా పర్యావరణంపై సంపూర్ణ అవగాహన ఉన్న దేశం. భారత ఉపఖండం లోని ప్రజలు చారిత్రాత్మకంగా ప్రకృతితో మమేకమై జీవిస్తూ, పర్యావరణంపై తమ అవగాహనని మౌఖికంగా ప్రచారం చేస్తున్నారు. పర్యావరణానికై జీవన విధానం (లైఫ్), భారత దేశ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు ప్రతిపాదించి, వాతావరణ మార్పులు, పర్యావరణ పతనానికి సమాధానంగా "లైఫ్"ని ప్రపంచం ముందు ఉంచారు. దేశాలు, రాష్ట్రాలు అభివృద్ధి పేరుతో తీసుకుంటున్న విధాన నిర్ణయాలు ఈ వాతావరణ మార్పులు, పర్యావరణ రక్షణకై జరిగే చర్యలకు ప్రతిబంధకాలుగా మారుతున్నాయి. ఈ సవాలుకి సమాధానం కావాలంటే విలువలతో కూడిన విద్య, జీవన శైలి నుండి అభివృద్ధి పథం దాకా సమగ్ర దిశ కావాలి. భారత ప్రధాని దృష్టిలో 'లైఫ్' అంటే మన నడవడికలో మార్పు రావాలి. ప్రకృతిని గౌరవించాలి. వనరులని చాలా జాగ్రత్తగా ఆచి-తూచి వినియోగించాలి. మన అవసరాలను తగ్గించుకొని మితంగా జీవించటానికి అలవాటు పడాలి. ఇవన్నీ భారత సాంప్రదాయంలో భాగాలుగా ఉన్నా, ఈ ప్రయత్నాలు ప్రపంచ వ్యాప్తంగా జరగాలి. భారత ప్రధాన మంత్రి మోదీ గారు అన్నట్లు 'ప్రకృతిని గౌరవించడం (పూజించటం)' అన్నది అనాదిగా భారతీయ సంస్కృతిలో జీర్ణించుకు పోయిన అంశం. అదే విధంగా పర్యావరణాన్ని సంరక్షించుకోవాలి అన్న ఆలోచన భారతీయులకు సహజంగానే అబ్బిన విద్య. ప్రస్తుత తరం వెల కట్టలేని సహజ వనరుల సంపదకు, భవిష్యత్ తరానికి ధర్మకర్తలుగా వ్యవహరించాలి.

'లైఫ్' ప్రపంచ పర్యావరణ పరిపాలనకు రాజకీయంగా, ఆర్థికంగా, శాస్త్రీయంగా చేపట్టే చర్యలకి సహాయకారిగా ఉంటూ, చేదోడుగా పని చేస్తుంది. ఇది సుస్థిర అభివృద్ధి గమ్యాలతో (ఎస్‌డిజి) సంధానం చేయబడింది. సుస్థిర ఉత్పత్తి, వినియోగం యస్.డి.జి.-12 పై ముఖ్యంగా పని చేస్తుంది. ఈ ఉత్పత్తి-వినియోగాలలో సుస్థిరతపై ప్రపంచ వ్యాప్తంగా ఈమధ్యనే 'ఇటలీ జి-20' అధ్యక్షతన యూరోపియన్ యూనియన్ వారు "సర్క్యులర్ ఫ్యాషన్" పేరిట 7 జూన్, 2021లో ఏర్పాటు చేసిన వెబినార్‌లో మొదటిసారిగా ప్రస్తావించబడింది. కానీ భారత దేశం ఈ పద్ధతిని కొన్ని శతాబ్దాలుగా ఆచరిస్తోంది.

వివిధ దేశాలకు చెందిన ప్రజా సంస్థలు తమ అనుభవ సారాన్ని క్రోడీకరించినపుడే ప్రపంచ పర్యావరణం అన్న అంశాన్ని విశ్వ వ్యాప్తంగా గుర్తించే పరిధిలోనికి తీసుకు రావటానికి వీలవుతుంది.

### 'లైఫ్' పునాదులు :

పంచతత్వాలైన 'ఆకాశం, వాయువు, అగ్ని (శక్తి), నీరు మరియు భూమి' ఈ పృథ్వికి పునాదులుగా ఉన్నాయి. అథర్వణ వేదంలో విశ్వం పుట్టుకకు కారణం ఈ పంచతత్వాల కలయికే అని, అందులోనే ఈ ఐదు మూల తత్వాలపైనే మన మనుగడ ఆధారపడి ఉందని ఉల్లేఖించబడింది.

## పూర్వ "జి-20" శిఖర సమావేశాలలో 'లైఫ్' వివిధ అంశాలు

యునైటెడ్ కింగ్‌డమ్ లో 2021లో జరిగిన 'సిఓపి-26' సందర్భంగా 'గ్లాస్గో'లో నిర్వహించిన వాతావరణ సమావేశంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ గారు "పర్యావరణానికై జీవన విధానం (లైఫ్)" ను ప్రవేశ పెట్టారు. ఈ సందర్భంలో 'లైఫ్'ను ఒక అంతర్జాతీయ ప్రజా ఉద్యమంగా చేపట్టాలని, అనాలోచిత, విధ్వంసక వినియోగ స్థానంలో ఆలోచనతో కూడిన అవసరమైన వాడకం ఉండాలని వ్యక్తులకు, ప్రపంచ సంస్థలకు, ప్రపంచ ప్రజా సమూహాలకు పిలుపునిచ్చారు.

చాలా కాలం నుంచి పర్యావరణం మరియు వాతావరణం అన్నవి 'జి-20' చర్చల్లో భాగంగా వస్తున్నాయి. 2017 నుంచి 2021 వరకు 'జి-20'కి అధ్యక్షత వహించిన దేశాలన్నీ కూడా వాతావరణాన్ని కాపాడుకోవాలని, మన భూ గ్రహాన్ని సంరక్షించుకోవాలని చెపుతూనే ఉన్నాయి. దీనిని సాధించే క్రమంలో వాతావరణ రక్షణకి అధిక నిధులను కేటాయించటం, తగ్గ సాంకేతిక పరిజ్ఞానాన్ని మార్పిడి చేసుకోవటం, పునరుత్పాదక శక్తిని నిబద్ధతతో ప్రోత్సహించటం లాంటి అనేక సూచనలు ఉన్నాయి.



2022లో ఇండోనేషియాలో జరిగిన 'జి–20' సమావేశాలలో సమగ్ర పోషక విలువలు, పేదరికం, అభివృద్ధి, సంరక్షణ లాంటి అంశాలు ప్రస్తావించబడినవి. ఈ సందర్భంలో ఇండోనేషియా 'జి–20' సమావేశాలలో భాగంగా వివిధ దేశాల పర్యావరణ మంత్రులు ప్రపంచం లోని సాంస్కృతిక వైవిధ్యమే స్థిరమైన జీవితానికి పునాది అని గుర్తించారు. ఇదే సమావేశంలో మన జీవన విధానంలోని కొన్ని అంశాలు నేరుగా పర్యావరణంపై ప్రభావం చూపుతాయని తీర్మానించారు. జీవన విధానానికి సంబంధించిన అంశాలు స్థానికంగా ఏ ప్రాంతానికి ఆ ప్రాంతం యస్‌డిజి లను స్థానికతకు అనుబంధంగా మార్చుకుని జీవన విధానాలతో ముడిపెట్టడానికి పూర్తి మద్దతును కొనసాగించాలని 'జి–20' వేదిక నిర్ణయించింది. ఇదే సందర్భంగా సమావేశమైన వివిధ దేశాల వ్యవసాయ మంత్రులు ఆహార కొరత, పర్యావరణ నష్టాన్ని కొలమానం చేయడానికి సాంకేతిక వేదికకు మద్దతును వక్కాణించారు.

## భారత దేశ అధ్యక్షతన 'సి-20 లైఫ్' వర్కింగ్ గ్రూప్

భారత దేశ అధ్యక్షతన 'జి–20' లో భాగంగా 'సి–20' విభాగంలో 'లైఫ్' పేరిట ఈ వర్కింగ్ గ్రూప్‌ని మొదటి సారిగా ప్రవేశ పెట్టబడింది. ఇది ప్రపంచ పర్యావరణ పాలనలో సాంస్కృతిక మరియు విలువలతో కూడిన మార్పులు తప్పనిసరి అన్న తరుణంలో సమయానుకూలంగా ప్రవేశ పెట్టడమైనది.

ఈ వర్కింగ్ గ్రూపు, పునాది స్థాయి ఇన్నోవేషన్లు, పంచ తత్వాలు, ఆహారము, అనాదిగా భారత సాంప్రదాయ జ్ఞానము, జీవన పద్ధతులు, నీరు, నివాసము, వ్యర్థాలు, పరిశ్రమలు, విద్యా విధానము మొదలైన అంశాలపై విడివిడిగా చర్చించడం జరిగింది. ఇందులో భాగంగా 'నందూర్‌బార్' ప్రాంతంలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు సామూహికంగా ప్రకృతిపై ఆధారపడిన సమస్యలపై సమాధానాలు మరియు 'లైఫ్ పై నందూర్‌బార్ మార్గం' నిర్వహించడం జరిగింది. వివిధ అంశాలపై జరిగిన అనేక సమావేశాలు, సదస్సులు, కార్యశాలలు, ఆన్‌లైన్ మీటింగ్‌లలో సంబంధిత భాగస్వాములు పాల్గొని, మానవ జీవితానికి సంబంధించిన అనేక దృక్కోణాలపై కూలంకషంగా చర్చలు జరిపి, జీవన దృష్టి, జీవన విధానంపై అనేక సూచనలు ఇవ్వటం జరిగింది.

భవిష్యత్తులో జరిగే 'జి–20' సదస్సులలో 'లైఫ్' కార్యక్రమాన్ని కొనసాగించటం కోసం వివిధ దేశాలు కొన్ని సూత్రాలపై అధార పడి, మంచి సూచనలు ఇచ్చేందుకు ప్రభుత్వేతర సంస్థలను ఏర్పాటు చేయాలని తీర్మానించింది. సుమంగళం (ప్రపంచ శ్రేయస్సు) సాధించే విధంగా సుస్థిర జీవన విధానాన్ని వ్యక్తులు, సమూహాలు చేపట్టాలన్న ఆలోచన ఇప్పుడే ఊపు అందుకుంటోంది.

'లైఫ్' వర్కింగ్ గ్రూప్ ఆధారంగా అనేక అంశాలపై చేసిన తీర్మానాలు ఈ క్రింద పొందుపర్చ బడ్డాయి.

## సూచనలు - పరిణామాలు

1. విలువల ఆధారంగా, సుస్థిర ప్రగతిని అంచనా వేసే చట్రాన్ని తయారు చేసి, అన్ని దేశాలకు మార్గదర్శకత్వం వహించేందుకు తగ్గ ఏర్పాట్లు చేయటం.

❀ 'సుమంగళం' (ప్రపంచ శ్రేయస్సు) సుస్థిర చట్రానికి విశ్వసూత్రం. ఇందులో వ్యక్తులకు, సమాజాలకు ఆచరణ యోగ్యంగా ఉన్న కొన్ని విలువలు, ఆలోచనలు, పద్ధతులు ఉండాలి. ఈ విధంగా చేస్తే సుస్థిరతకి సంపూర్ణంగా దోహద పడటానికి అవకాశం ఏర్పడుతుంది. 'కరుణ, కృతజ్ఞత, వైవిధ్యాన్ని గౌరవించటం, బాధ్యత తీసుకోవటం, వికేంద్రీకరణ, సామరస్యము, దూర ప్రాంతాల నుండి కాక స్థానికంగా దొరికే వనరులను ఉపయోగించటము' మొదలైన విలువల ద్వారా ప్రవర్తన సూచికలు, లక్ష్యాలు, ప్రగతి స్థాయి మొదలైనవి అంచనా వేసుకోవచ్చు.

❀ విలువల ఆధారిత సుస్థిర పద్ధతుల చట్రం ద్వారా హక్కుల ఆధారంగా కాక బాధ్యతల ఆధారంగా మౌళిక మార్పు చేసి ప్రపంచ పర్యావరణ నియంత్రణ సాధించాలని కోరుకోవటమే 'లైఫ్' ఉద్దేశ్యం.

2. 'లైఫ్' కి సంబంధించిన జ్ఞాన సంగ్రహాలయాన్ని ఏర్పాటు చేయటం – 'జి–20' సభ్య దేశాల వ్యాపార సంస్థల, సమూహాల, వ్యక్తుల మంచి పద్ధతులను క్రోడీకరించి, ఒక జ్ఞాన సంగ్రహాలయం ఏర్పాటు చేసుకోవాలి. ఇటువంటి జ్ఞాన సంగ్రహాలయం వ్యక్తుల, గుంపుల జీవన విధానాలలో మార్పులు తీసుకు రావటానికి అభివృద్ధి మార్గదర్శకాలు నిర్దేశించటానికి, ప్రకృతిని సంరక్షించటానికి, కార్బన్ ఫుట్ ప్రింట్స్‌ని తగ్గించటానికి దోహద పడతాయి.

3. ప్రపంచ స్థాయిలో విధాన నిర్ణయాలు చేసేటప్పుడు పునాది స్థాయి ఇన్నోవేషన్ల (గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్స్)ను మానవాళికి సేవ చేసే ఒక ప్రత్యేక సంపద గా గుర్తించాలి. వీటిని మిగతా ఇన్నోవేషన్లతో కలుపకుండా ప్రత్యేక రకంగా పరిగణించాలి. మానవాళికి పునాది స్థాయి ఇన్నోవేటర్లు అతి ముఖ్యమైన ఆస్తి. తక్కువ వనరులతో ఎక్కువ ఫలితాన్ని చూపించి ఆర్థికాభివృద్ధిలో ప్రత్యేకమైన పాత్రను ఈ ఇన్నోవేషన్లు పోషిస్తున్నాయి. ఆర్థిక చట్ర పద్ధతిలో ఉన్న 6 కార్యాలలో మూడింటిని ఈ ఇన్నోవేటర్లు సంపూర్తిగా అమలు చేస్తున్నారు. ఆర్థికాభివృద్ధిలో ముఖ్యపాత్ర పోషించే 'తిరిగి వాడటం (రీ యూజ్), తిరిగి ఉపయోగం (రీ సైకిల్), మరమ్మత్తు (రిపేర్)' ఈ మూడింటిని పాటించే వారు పునాది స్థాయి ఇన్నోవేటర్లు. పర్యావరణ సమస్యల పరిష్కారంలో వారు చేస్తున్న కృషికి సముచిత స్థానమివ్వటం మన తక్షణ కర్తవ్యం.

4. స్థానిక వినియోగదారుల కొరకు స్థానికంగా కాలాల వారిగా లభించే ఆహారాన్ని ప్రోత్సహించటం. 'జి–20' సభ్య దేశాలు స్థానికంగా పండించి, ప్రక్రియ చేసి, నిలువ చేసి, విలువ జోడించిన ఆహార పదార్థాలను తమ ప్రజలు వాడేలా ప్రచారం చేస్తూ ప్రోత్సహించాలి. ఇది మానవుల ఆరోగ్యానికి, పర్యావరణానికి కూడా ఎంతో శ్రేయస్కరం. స్థానిక వస్తువులను స్థానికంగా వాడితే రవాణా, ఇంధన ఖర్చులు కూడా ఆదా అవుతాయి. స్థానికంగా పండే ఆహారాన్ని స్థానికంగానే వినియోగిస్తే ప్రాంతాల వారీగా లభించే ప్రత్యేకమైన పంటలు, పళ్ళు, కూరగాయల రకాలను సంరక్షించిన వాళ్ళమవుతాం. పైగా కాలాల వారి ఆహార వినియోగంతో పంటలను సంరక్షించటానికి వినియోగించే రసాయనాల వాడకం తగ్గి, తాజా మరియు ఆరోగ్య దాయకమైన ఆహారం అందించవచ్చు.

5. ప్రస్తుత ఆధునిక అలంకరణ, దుస్తుల స్థానంలో ప్రకృతిసిద్ధమైన అలంకరణ, దుస్తులకు ప్రోత్సాహం : ప్రపంచ ఫ్యాషన్ పరిశ్రమ మొత్తం 10% కర్బన ఉద్గారాలకి కారణం అవుతోంది. ఇది అంతర్జాతీయంగా విమానాలు, వర్తకపు ఓడలు విడుదల చేసే కర్బనం కన్నా ఎక్కువ. 'జి–20' సభ్య దేశాలు అన్ని విధాలా

పర్యావరణానికి, ప్రకృతికి హాని చేయని సుస్థిర ఫ్యాషన్ పద్ధతులను, అలంకరణ సామగ్రిని ప్రోత్సహించాలి. ఈ పరిశ్రమలో ఉండే వస్తువులకి, తయారు చేసే పద్ధతులకి, వాటాదారులకు, విధాన నిర్ణయాలు చేసేవాళ్ళు, కంపెనీలు, వినియోగదారులు వీరంతా కర్బన తటస్థత ఆధార ఫ్యాషన్ సెక్టార్ ను ప్రోత్సహించాలి. దీంతో సమానత్వము, సామాజిక న్యాయము, జంతు సంరక్షణ, పర్యావరణ సంరక్షణ వైపు దృష్టిని కేంద్రీకరించాలి.

6. బాధ్యతాయుత వ్యర్థాల విసర్జన మరియు విచక్షణతో కూడిన వినియోగాన్ని ప్రోత్సహించడం. అభివృద్ధి చెందుతున్న దేశాలలో చెత్తను సేకరించటం–వేరు చేయడం చాలా వరకు అనధికారిక రంగంలోనే జరుగుతోంది. దీనిని అధికారిక రంగంతో సంబంధాలు పటిష్ఠపరిచి, మెరుగుపడేలా చేయాలి. వ్యర్థాల యాజమాన్యం సక్రమంగా పని చేయకపోవటానికి కారణం సరియైన అవగాహన, విద్య లేకపోవటం. ఈ వ్యర్థాల సమస్యను అధిగమించటానికి శుభ్రతలో గౌరవం ఉందనే భావన, అది మన బాధ్యత అనే ఆలోచన, బాధ్యతగా వ్యవహరించిన వారికి ప్రోత్సాహకాలు ఇవ్వటం మొదలైన చర్యలతో మన పట్టణాలను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవచ్చు.

7. 'లైఫ్' లోకి మారటం అన్నది సాంఘిక, భావోద్వేగ, నైతిక, ఆధ్యాత్మిక ప్రక్రియ అని గమనించటం : ప్రకృతితో సంధానం, పునఃసంధానం పునాది దశలోనే (అనగా 3 నుంచి 8 సంవత్సరాల వయసులోనే) అలవాటు చెయ్యాలి. ప్రత్యక్ష మరియు పరోక్ష ప్రయోగాలు, నిజ జీవితపు అనుభవాలు, స్వయంగా పాల్గొని నేర్చుకునే పద్ధతులు మొదలైన అనేక మార్గాలు, అన్ని స్థాయిల్లో జరగాల్సి ఉంటుంది.

8. ప్రకృతి ఆధారిత పరిష్కారాల ప్రచారం – అనుసరణ : ప్రకృతి ఆధారిత పరిష్కారాలు అందరికీ తెలిసిన పద్ధతులే. (ఉదా.: పవిత్ర అడవులు, సాంప్రదాయ వ్యవసాయం, అడవి ఉత్పత్తులు మొదలైనవి). ఈ పద్ధతి సాంప్రదాయ జ్ఞానము, స్థానిక పద్ధతులు, సమూహాల అనుభవాలపై నిర్మింపబడాలి.

   ❀ సరియైన అమలుతో బహుళ ప్రభావం ఉంటుంది. ఉదా.: సమైక్య వాటర్‌షెడ్ యాజమాన్యాల ఫలితంగా నీరు, భూమి సంరక్షణ, వ్యవసాయ ఉత్పత్తుల అభివృద్ధి, వృక్షాల పెంపుదల, ఆర్థికపరంగా జీవన విధానాల అభివృద్ధి జరుగుతాయి.

9. అన్ని ఆర్థిక రంగాలలో ఆర్థిక వృత్త సూత్రాలను తప్పనిసరిగా అమలు చేసేట్లు నిర్దేశించాలి.

   ❀ 'జి–20' సభ్య దేశాలు వారివారి ఆర్థిక రంగంలో ఆర్థిక వృత్త సూత్రాలను తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలి. దీనికి తగ్గట్టు వారికి అవసరమైన విధాన నిర్ణయాలు, చేసిన నిర్ణయాలలో తగు మార్పులు ఉండేలా చూసుకోవాలి.

   ❀ సరళ ఆర్థిక పద్ధతి 50% హరిత గృహ వాయువులకు కారణమౌతోంది. ముడిసరుకు వస్తువులుగా మార్చబడి, వినియోగించబడి లేదా వాడి నేరుగా వాతావరణంలోనికి విసర్జించడమే దీనికి కారణం.

   ❀ వృత్త ఆర్థిక పద్ధతి పై సవాళ్ళను ఎదుర్కోవడానికి సహాయ పడుతుంది. వృధాల తగ్గింపు వస్తువులను, పద్ధతులను ఆర్థిక వృత్తంలోకి తీసుకు రావడం వల్ల సహజ సంపద సంరక్షింప బడుతుంది.

❀ వ్యాపార సంస్థలు, పరిశ్రమలు తమ ఉత్పత్తులను, వస్తువులను సమర్థవంతమైన వనరుల యాజమాన్యం తో సక్రమమైన వ్యర్థాల నిర్వహణతో పని చేసినపుడు వారికి 'గ్రీన్ క్రెడిట్స్' (పర్యావరణ రక్షణలో పాలు పంచుకున్నం దుకు గాను) ఇచ్చి వాటిని పన్నులలో, గ్రాంటులలో, ఇతర రకములైన ఆర్థిక ప్రోత్సాహకాలతో బదిలీ చేసుకునే సదుపాయం కల్పించాలి.

10. 'లైఫ్' అన్ని రంగాలలో నీటిని సమంగా అందరికీ అందేలా చూడటం, అతి జాగ్రత్తగా ఉపయోగించటం.

❀ పంచ తత్వాలలో 'నీరు' అన్నది అతి ముఖ్యమైన తత్వం.

❀ నీటిని పునర్ ఉపయోగం చేసినా, తిరిగి వాడటానికి అనువుగా మార్చినా, కొత్త నీటిని సృష్టించినట్లే.

❀ ఆహారంలో కాని, పంటలలో కాని నీటిని తక్కువగా వాడే పద్ధతులను అవలంభించాలి.

❀ నీటి అవసరమున్న ప్రతి రంగంలోను "అవసరము – సరఫరా" యాజమాన్యం ప్రభావ వంతంగా చేయాలి.



# ఉదాహరణలు

## పునాది స్థాయి ఇన్నోవేటర్లను గుర్తించటం

భారతదేశంలోని హైదరాబాద్ నగరంలో "పల్లెసృజన" అనే స్వచ్ఛంద సంస్థ 'పునాది స్థాయి ఇన్నోవేటర్ల' జీవన స్థితిని మెరుగు పర్చటానికి అంకిత భావంతో పని చేస్తోంది. గ్రామాలలో, మారుమూల ప్రాంతాలలో ఉన్న ఇన్నోవేషన్లను గుర్తించి, వారి ఇన్నోవేషన్లను గ్రంథస్తం చేయటానికి 'పల్లెసృజన' శోధయాత్రలు నిర్వహిస్తుంది. ఇన్నోవేటర్‌ను గుర్తించిన తర్వాత అతని ఇన్నోవేషన్‌కు అవసరమైన సాంకేతికపరమైన మార్పిడి చేయటానికి సలహాలు, సూచనలు, సహాయము అందజేసి, తుది రూపాన్ని ధృవీకరించి, పేటెంటు చేయడానికి కూడా సహాయపడుతుంది. ఇప్పటి వరకు పల్లెసృజన 78 మంది ఇన్నోవేటర్లను, వెయ్యికి పైగా సాంప్రదాయ ఔషధ పద్ధతులను గుర్తించి, వాటిని "నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్" లో నమోదు చేయించింది. 'పల్లెసృజన' గుర్తించిన ముగ్గురు ఇన్నోవేటర్లు భారత దేశంలో మూడవ అత్యున్నత ప్రజా పురస్కారం అయిన 'పద్మశ్రీ' వరించింది. 'పల్లెసృజన' కేవలం స్వచ్ఛంద కార్యకర్తల ద్వారా నిర్వహించ బడుతోంది. అంకిత భావంతో పునాది స్థాయి ఇన్నోవేషన్లపై మక్కువ ఉండి, ఇన్నోవేటర్ అంటే అభిమానం ఉన్న ఈ స్వచ్ఛంద కార్యకర్తలే 'పలెసృజన'కి వెన్నెముకగా సేవలందిస్తున్నారు.

## 'లైఫ్' ద్వారా సుస్థిరతను సాధించే గృహావసరాల వితరణ

భారత దేశం లోని ముంబై నగరంలో 32 వేల మంది సభ్యులతో 'ముంబై గ్రాహక్ పంచాయత్' పేరిట ఒక వినియోగ దారుల సంఘం నిర్వహించ బడుతోంది. 3,500 మంది స్వచ్ఛంద కార్యకర్తలు దీనిని నిర్వహిస్తున్నారు. ప్రతి నెల సహకార పద్ధతిలో వీరు గృహావసరాలకు కావలసిన సామాన్లు కొనుగోలు చేసి, వికేంద్రీకరణ పద్ధతిలో సభ్యుల ఇంటి దగ్గరికి అందజేస్తారు.

సహకార పద్ధతిలో కొనటం వికేంద్రీకరణ పంపకం వలన శక్తి ఉపయోగం, ఇంధనాల ఆదా అవుతుంది. అలాగే ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని చాలావరకు తగ్గించి, పర్యావరణానికి హాని చేయని సరుకులు గడప దగ్గరికి అందిస్తారు. తద్వారా స్థానిక ఉత్పత్తి, వినియోగ వృత్తాన్ని ప్రోత్సహిస్తున్నారు.

వీరి కార్యక్రమం ద్వారా జీవన విధానాన్ని పర్యావరణానికి అనుకూలంగా మారుస్తున్నారు. అదే కాకుండా సహకారం, సహ భావనలను సభ్యులలో పెంపొందిస్తున్నారు. ఇదే ఈ సంస్థ 'లైఫ్'కు చేస్తున్న కృషి.








## సామాజిక సేవా సంస్థ (సి.ఎస్.ఓ.) చొరవతో 'లైఫ్'

భారతదేశ పశ్చిమ భాగంలో సాత్‌పుధా పర్వత కనుమలలో ఒక మారుమూల ప్రదేశం నందుర్‌బార్. జనాభా పూర్తిగా గిరిజనులు. అటవీ సంపదపై ఆధారపడి జీవిస్తుంటారు. ఈ జిల్లాలో ఒక సామాజిక సంస్థ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న (1 జులై, 2023) సందర్భంలో 'లైఫ్' ఉద్యమంలో భాగంగా 25 వేల మొక్కలను నాటి, ఆ ప్రాంతపు గిరిజనుల భవిష్యత్తు అవసరాలు తీర్చటానికి ముందుకు అడుగు వేసింది.

## 'లైఫ్' పై డిజిటల్ ప్రతిజ్ఞ

'సి-20' లో భాగంగా 'లైఫ్ వర్కింగ్ గ్రూప్' పేరెన్నిక కలిగిన ఉన్నత విద్యా సంస్థలు, అనేక సామాజిక సేవా సంస్థలతో కలిసి 'లైఫ్' పై డిజిటల్ ప్రతిజ్ఞా కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో వందల పౌరులు దేశం నలుమూలల నుంచి సోషియల్ మీడియా ద్వారానే కాక, వ్యక్తిగతంగా కూడా పాల్గొన్నారు.

## 'లైఫ్' తో పట్టణ ప్రాంత జీవితంపై ఒక వ్యక్తిగత దృష్టాంతం

శ్రీ మయూర్ భావే శ్రీమతి సుజాత భావే వారి కుటుంబంతో భారత దేశం లోని మహారాష్ట్రలో పూణే పట్టణంలో నివసిస్తున్నారు. 6గురు సభ్యులు కల ఈ కుటుంబం '5 ఆర్' సూత్రాలను – వద్దనటం (రెఫ్యూజ్), తగ్గించటం (రెడ్యూజ్), తిరిగి వాడటం (రీ యూజ్), పునర్నిర్మించటం (రీసైకిల్), తిరిగి నింపటం (రిప్లనిష్) తప్పకుండా పాటిస్తున్నారు. వీరి కుటుంబం నిర్వహించే బయోగ్యాస్ ప్లాంట్ 75% వీరి వంట గదినుండి వచ్చే వ్యర్థాలతో, 100% వ్యర్థాల నిర్వహణతో నడుస్తున్నది. వీరి ఇంటి డాబాపై ఏర్పాటు చేసిన తేనెపట్టు డబ్బా (హనీబీ బాక్స్) ఇంటికి తేనెని, చల్లదనాన్ని ఇవ్వటమే కాక, చుట్టుప్రక్కల ప్రాంతల్లో పరపరాగ సంపర్కానికి దోహద పడుతోంది. భావే కుటుంబం వీటిని ఆదా చేయటానికి అనేక మార్గాలు పాటిస్తూ, వాటినే తమ జీవన శైలిలో భాగంగా చూసుకున్నారు.

నిత్య జీవితంలో పర్యావరణంపై భారాన్ని తగ్గించటానికి మనం నిరంతరం చేసే చేతనైన చర్యలే 'లైఫ్' విధానానికి మూలం.

## పురాతన సాంప్రదాయాన్ని పునరుద్ధరించటం ద్వారా సామాజిక నీటి రక్షణగా 'లైఫ్'

'హల్మా' అనేది భారత దేశపు మధ్యప్రదేశ్ రాష్ట్రంలో 'జబువా' జిల్లాలో, భిల్ సమాజానికి చెందినవారు ఆచరించే సాంప్రదాయం. ఈ సాంప్రదాయంలో, అవసరమున్న వారికి ప్రతిఫలం ఆశించకుండా సహాయం చేయటం అన్న ప్రాతిపదికన పనిచేస్తుంది. జబువా జిల్లాలోని ప్రజలు 'భూమాత' అతి ఎక్కువ కష్టంలో ఉందని నమ్ముతారు. భూమి దాహార్తి – ఆమెకి అత్యవసరంగా నీరు అందించాలి. ఆ ప్రాంతంలో 2010 నుంచి పని చేస్తున్న 'శివగంగ అభియాన్' అనే ఒక సామాజిక సంస్థ ప్రతి సంవత్సరం 'హల్మా' కార్యక్రమానికి పిలుపునిస్తుంది. వేలకొద్దీ గిరిజనులు ఈ ఉద్యమంలో స్వచ్ఛందంగా పాల్గొంటారు. వారితోపాటు భూమిని తవ్వటానికి అవసరమైన పనిముట్లు తామే తెచ్చుకుంటారు. పంట వేయటానికి ఆకృతి (కాంటూర్) సేద్యానికి వీలుగా కొండ ప్రాంతాలను త్రవ్వి పంటలు, మొక్కలు నాటుతారు. ఇదంతా వారు స్వలాభాపేక్ష లేకుండా సమాజం కోసం చేస్తున్న సేవ. ఈవిధంగా ప్రతి గ్రామ ప్రజలు వారివారి ప్రాంతంలో నిస్వార్థ సేవ చేసి, కొండమీద నుండి కిందికి పారే నీటిని ఆపి, భూమాత దాహార్తి తీర్చి, తమకు అనువైన పంటలను పండించు కుంటున్నారు. ఈ ప్రయత్నము గణనీయమైన వాతావరణ మార్పుకు దోహదకారియై, నీటి వనరులు, వ్యవసాయం, ఆదాయం చెప్పుకోదగ్గ స్థాయిలో మెరుగు పడటానికి తోడ్పడ్డాయి.

भारत 2023 INDIA

वसुधैव कुटुम्बकम्

ONE EARTH • ONE FAMILY • ONE FUTURE

CIVIL 20 INDIA 2023